క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం



సురేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పట్టణానికి చెందిన గందె సురేశ్‌ను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గందె సురేశ్‌ను పూలమాలలు వేసి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పలబట్ల మోహన్‌రావు, గజవాడ వెంకటేశ్, బెజుగం రమేశ్, లష్కర్ కుమార్, పెద్దిరామ్మోహన్, యంసాని శ్రీనివాస్, మలిపెద్ది శ్రీనివాస్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేందర్



కొత్తూరు: పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని పెంజర్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ సురేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శులకు అందుబాటులో ఉంటూ వారి శ్రేయస్సు కోసం తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

ఏఐ సెంటర్‌గా కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్



కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్

కొత్తూరు: మున్సిపాలిటీలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అంగూర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతతో ఎలాంటి సంబంధం లేకుండా 15 ఏళ్లు నిండి చదవడం, రాయడం వచ్చినవారు నేరుగా పదో తరగతిలో అడ్మిషన్ పొందవచ్చన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఏడాది తర్వాత ఇంటర్‌మీడియట్‌లో అడ్మిషన్ తీసుకోవచ్చని వివరించారు. ఈ నెల 31 వరకు అడ్మిషన్లు పొందడానికి గడువు ఉన్నట్లు తెలిపారు. పలు కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం పాఠశాల కో–ఆర్డినేటర్ రాజును సంప్రదించాలని సూచించారు.

బదిలీ అయిన స్థానంలో వేతనాలివ్వాలి

ఏటీఓకు యూటీఎఫ్ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఉపాధ్యాయులకు బదిలీ అయిన చోటనే వేతనాలు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు సోమవారం ఏటీఓ(అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలామంది ఉపాధ్యాయులు ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లారన్నారు. బదిలీపై వెళ్లిన వారికి వారు చేసిన స్థానాల్లోనే వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సగం పాత స్థానంలో, మిగితా సగం కొత్త స్థానంలో వేతనాలకు సంబంధించి బిల్లులు చేస్తున్నారన్నారు. దీంతో వేతనాలు ఎప్పుడు వస్తాయోనని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. నాన్‌డ్రాస్ సర్టిఫికెట్‌తో మొత్తం జీతాన్ని ఒకేస్థానంలో చేసేందుకు ట్రెజరీ స్టేషన్‌లో అవకాశం ఉందన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వారికి వేతనాలను కొత్త స్థానంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, బాలయ్య, కృష్ణ, నర్సింలు ఉన్నారు.

మారిందేముంది..!

- మండలాలు వేరుపడినా కార్యాలయాలు పాతవే..
- నందిగామలోనే కొనసాగుతున్న మూడు పీఏసీఎస్‌లు, రెండు పీహెచ్‌సీలు
- సేవల విస్తరణలో ప్రభుత్వ జాప్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు



నందిగామ మండల పరిధిలో ఉన్న కొత్తూరు పీహెచ్‌సీ

కొత్తూరు: మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మండలంలో కొనసాగిన మేజర్ గ్రామ పంచాయతీ నందిగామను ఎనిమిదేళ్ల క్రితం నూతన మండలముగా ఏర్పాటు చేశారు. కాగా ఏళ్లు గడుస్తున్నా కార్యాలయాలను మాత్రం ప్రజలకు అనుకూలంగా ఏర్పాటు చేయలేదు. దీంతో ఇప్పటికీ మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లు కొత్తగా ఏర్పాటైన నందిగామ మండలంలోనే ఉన్నాయి. ఆయా పనుల నిమిత్తం అవసరం ఉంటే ప్రజలు, రైతులు కొత్తగా ఏర్పాటైన మండలానికే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం సంఖ్యాపరంగా కొత్త మండలాలు చేశారే తప్పా పూర్తిస్థాయిలో పాలనపరమైన చర్యలు తీసుకోవడంలో ఇప్పటికీ పాలకులు, ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు.

రెండు పీహెచ్‌సీలు నందిగామలోనే..

గతంలో కొత్తూరు మండలంలో పారిశ్రామికవాడ, జాతీయ రహదారి ఉండడంతో ఆయా ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో కొత్తూరు, నందిగామలో రెండు పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. కాగా మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రెండు పీహెచ్‌సీలు కాస్త నందిగామ మండల పరిధిలోకే వెళ్లాయి. ప్రస్తుతానికి నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకే కొత్తూరు మండలానికి చెందిన రోగులు వెళ్తున్నారు. కొత్తూరు మండలంలో 32వేలకుపైగా జనాభా ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి.



నందిగామలో కొనసాగుతున్న పీఏసీఎస్ కేంద్రం

మూడు పీఏసీఎస్‌లు పక్క మండలంలోనే

ప్రస్తుతం నందిగామ మండలంలోని మేకగూడ, చేగూరు, నందిగామ మండల కేంద్రాల్లో మూడు (పీఏసీఎస్)లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కొనసాగుతున్నాయి. కొత్తూరు మండలంలో మాత్రం ఒక్క సంఘం కూడా లేదు. మండలాలు విభజన జరిగి ఎనిమిదేళ్లు గడుస్తున్నా రైతులు సేవలు మాత్రం పాత కార్యాలయాల నుంచే పొందుతున్నారు.

అయోమయంలో ప్రజలు

పీహెచ్‌సీలు, పీఏసీఎస్‌లు రెండు నందిగామ మండలంలోనే కొనసాగుతుండడంతో వాస్తవానికి కొత్తూరు మండలం నుంచి నందిగామ వేరుపడి కొత్త మండలముగా మారిందా..? లేదా అనే అయోమయంలో ప్రజలు, రైతులు ఉన్నారు. వారి అయోమయాన్ని నిజం చేస్తున్నట్లుగా కొత్త మండలం ఏర్పాటై ఎనిమిదేళ్లు గడుస్తున్నా కార్యాలయాలు మాత్రం వేరుపడలేదు. ఇప్పటికీ పనుల నిమిత్తం పాత కార్యాలయాలకే వెళ్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కొత్తూరు మండల పరిధిలో పీహెచ్‌సీ, పీఏసీఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నందిగామలోనే కొనసాగుతున్నాయి



ప్రస్తుతం మూడు పీఏసీఎస్ కేంద్రాలు నందిగామ మండలంలోనే కొనసాగుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు నందిగామ, మేకగూడ, చేగూరు గ్రామాల్లోని పీఏసీఎస్ కేంద్రాల్లోనే ఇప్పటికీ విత్తనాలు, ఎరువులు తీసుకుంటున్నారు.

– గోపాల్, ఏఓ, కొత్తూరు

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి, ప్రభాకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పీసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలుగుట్ట గ్రామంలో సీసీరోడ్డు పనులను మండల ఏఈ ప్రభాకర్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కందవాడగేట్ నుంచి వయా పలుగుట్ట, కందవాడ మీదుగా నారాయణదాస్‌గూడ వరకు బీటీరోడ్డుకు 1.95కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధుల్లోనే పలుగుట్ట గ్రామంలో నుంచి వెళ్తున్న ఈరోడ్డు పరిధిలో సీసీ రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే బీటీరోడ్డు పనులు కూడా పూర్తికానున్నట్లు చెప్పారు. ఇటీవల ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు సంబంధించిన నిధులు కూడా విడుదల చేసిందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఇన్నాళ్లుగా గ్రామీణ రోడ్లను పట్టించుకున్న వారు లేరని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, గ్రామ నాయకులు పెద్దలు, నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, చిన్న జనార్దన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వీరారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పామెన జంగయ్య, మధుసూదన్‌రెడ్డి, రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అశోక్, రామయ్య, సత్తయ్య ఉన్నారు.

శబరిమలకు పాదయాత్ర

శంకర్‌పల్లి: పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు సోమవారం శబరిమలకు శంషాబాద్ నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్ర మొత్తం 37 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శబరిమలకు వెళ్తున్న వారిలో ప్రశాంత్, సాయి కిరణ్‌రెడ్డి, ప్రేమ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, సోనుసింగ్, ప్రవీణ్, యశ్వంత్‌రెడ్డి, వంశీలు ఉన్నారు.



శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

పశువులకు టీకాలు తప్పనిసరి



షాబాద్: సోలీపేట్‌లో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయిచుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ, సోలీపేట్, అంతారం, నరెడ్లగూడ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతుల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

చిలుకూరులో..

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో సోమవారం గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 146 పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావ్, గోరిమియా, గోపాల మిత్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: చిలుకూరులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి అహ్మద్

ఘనంగా మైసమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

నందిగామ: మండల కేంద్రంలో సోమవారం మైసమ్మ బోనాల ఉత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతల విగ్రహాల పునఃప్రతిష్ఠలో భాగంగా గతవారం రోజుల నుంచి కొనసాగుతున్న పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నందిగామ, అంతిరెడ్డిగూడ గ్రామాలకు చెందిన మహిళలు బోనాలను పెద్దఎత్తున ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులోని ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు ఆలయంలో గ్రామస్తులు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నందిగామ, అంతిరెడ్డిగూడ గ్రామాలకు చెందిన ప్రజలు, పార్టీలకతీతంగా నేతలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన ప్రభుత్వం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మాడ్గుల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అములులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం వారు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ముగుస్తున్నా రైతుభరోసా ఇవ్వకుండా రైతులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. భరోసాతో పాటు అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లలాయ్యగౌడ్, జైపాల్ నాయక్, శంకర్ నాయక్, పవన్ కుమార్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, యాదయ్య, విజయ్, శివ, అల్లాజి, నిరంజన్ పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

ఆమనగల్లు: రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడొచ్చని ఎస్‌ఐ వెంకటేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసుశాఖ, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన యువతీ యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. ప్రజల్లో రక్తదానంపై ఉన్న అపోహలను పోగొట్టడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాష, జిల్లా చైర్మన్‌లు రమేశ్, చంద్రశేఖర్, యాదయ్య, సభ్యులు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరుపేదలు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. రాజకీయాలకతీతంగా పేద ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గాలను చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్వతాలు, జంగయ్య, శ్రీను, లింగం, గోవింద్ తదితరులు ఉన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఉర్సు ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో ఉన్న హజ్రత్ సయ్యద్ అబ్బాషా ఖాద్రీ చిశ్తీ పీర్ గయాబ్‌షా దర్గాలో ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతసామరస్యాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పండగలు జరుపుకోవాలన్నారు. దర్గాలో ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, మన్నె నారాయణయాదవ్, దేవేందర్‌యాదవ్, ముబీన్ గోరి, పరంధాములుయాదవ్, యాదయ్య, మల్లేశ్, అశోక్, నరేశ్‌గౌడ్, నిర్వాహకులు మహ్మద్ అబ్బాస్, అన్వర్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిలో ఇంకుడుగుంత ఉండాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: ప్రతీ ఇంటిలో ఇంకుడుగుంత ఉండేలా చూడాలని కార్యదర్శులకు ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్తగా మరుగుదొడ్లు అవసరమైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, అదేవిధంగా డంపింగ్‌యార్డు అవసరమైన గ్రామాల్లో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతీ ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

విద్యార్థులకు యూనిఫాం, షూ పంపిణీ

షాద్‌నగర్: దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం రసూల్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం పటేల్‌కుంట తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన లింబ్యానాయక్ స్పోర్ట్స్ డ్రెస్, షూ, టై, నోటు బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, గోపాల్‌నాయక్, రాములు, నటరాజ్, శ్రీకాంత్, రాజు, బాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేగూరు ప్రాథమిక పాఠశాలలో..

నందిగామ: మండల పరిధిలోని చేగూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బంటారం మల్లేశ్ సోమవారం ఉచితంగా యూనిఫాం, షూ, టై, బెల్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజారెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ భాగ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: విద్యార్థులకు షూ, టై, బెల్టు అందజేస్తున్న దాత

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



పాపిరెడ్డిగూడలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

- ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేపీ మహా సభ్యత్వ నమోదు అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, దత్తాయపల్లి, వేములనర్వ, చింతకుంటపల్లి గ్రామాల్లో సోమవారం పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పర్యటించి సభ్యత్వ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బూత్‌స్థాయిలో మెజార్టీ సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు. బూత్‌స్థాయిలో పార్టీ బలంగా ఉంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందన్నారు. 24వ తేదీ సభ్యత్వ నమోదుకు చివరరోజు కావడంతో లక్ష్యం నెరవేరేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, సభ్యత్వ సహ ప్రముఖ్ కరేడ్ల నరేందర్‌రెడ్డి, కుమ్మరి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌గౌడ్, పర్వతాలు, వినయ్‌కుమార్, విగ్నేశ్, భిక్షపతి, శివకుమార్, పరేశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కడ్తాల్: మండల పరిధి చరికొండ గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్ అనారోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ సమస్యను ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సహకారంతో హుస్సేన్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని సోమవారం నిమ్స్‌లో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు